క్లుప్తంగా

జంతువులను సంరక్షించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో జంతులను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జంతు సంరక్షణ సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆవులను అక్రమంగా రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా మున్సిపాలిటీల్లో సమస్యలు అడిగితె లుసుకున్నారు. జిల్లా సంరక్షణ సొసైటీకి పూర్తిగా తన మద్దతు ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరన్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్, ఏఎస్పీ మందజావళి పాల్గొన్నారు.

వైభవం..లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణోత్సవాన్ని జరుపుతున్న దృశ్యం

ఆళ్లగడ్డ: మున్సిపల్ పరిధిలోని పడకండ్లలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామిని నూతన పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనతరం ఆలయ మాఢవీధుల్లో ఊరేగించి, కల్యాణ మండపానికి తోడ్కొని వచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.

వృద్ధాశ్రమానికి కుర్చీల విరాళం



కుర్చీలను విరాళంగా అందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రైతు నగరంలోని గోరంట్ల చిన్న రంగమ్మ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి శ్రీ గురురాజా ఇంగ్లిష్ మీడియం పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి కుర్చీలను విరాళంగా అందించారు. బుధవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమానికి చేయూత అందించారు.

రసాయన ఎరువులు తగ్గించాలి



ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఆళ్లగడ్డ:ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని మండల వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా కొండంపల్లి గ్రామంలో వ్యవసాయ పనులను ప్రారంభించారు. భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఇక్కడి పొలాల్లో రసాయనం అధికంగా ఉందని చెప్పారు. కావున సేంద్రియ ఎరువులను అధికంగా వాడాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాగ్యలక్ష్మి

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరానికి సమీపాన పొలాల్లో ఉపాధి హామీ పథకం కింద నిర్మితమవుతున్న రోడ్డు పనులను బుధవారం ఎంపీడీఓ భాగ్యలక్ష్మి పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పనికి తగ్గ కూలి అందుతుందా లేదా అని అడిగి తెలుసుకు న్నారు. అలాగే పని ప్రదేశంలో వసతులపై ఆరా తీశారు. కూలీలకు సంబంధించిన మస్టర్లను పరిశీలించారు. ఈసీ సుబ్బన్న, టీఏ నాగేంద్ర ఉన్నారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నెలో జరిగిన మూలపెద్దమ్మ దేవరలో విద్యుదాఘాతంతో దొర్నిపాడుకు చెందిన ఉష మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానంద రెడ్డి బాధిత కుటుంబానికి బుధవారం రూ.లక్ష నగదును అందజేశారు. అనంతరం పాలిమేర రెడ్డి, కర్నాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పెద్దమ్మ దేవరను విజయవంతం అయ్యేందుకు సహకరించిన గ్రామపెద్దలు, పోలీసులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ హరి ఉన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

- నేడు తలుపులు తెరుచుకోనున్న పాఠశాలలు
- విద్యార్థులకు కొరవడిన సమస్యలు
- పట్టించుకోని ప్రభుత్వం



పెద్దకంబలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా అదనపు తరగతి గదులు, (ఇన్‌సెట్) నిర్మాణం పూర్తి కాని కిచెన్ షెడ్డు, పొలాల మధ్య పాఠశాల దారి

రుద్రవరం: వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. ఇన్ని రోజులు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు గురువారం పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. అరకొర వసతుల మధ్య చదువులు సాగించాల్సి ఉంది. మండలంలో గత ప్రభుత్వం నాడు–నేడు కింద రెండు విడతలుగా కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది.

పనులు నిలిపివేత..

రెండో విడతలో చేపట్టిన పనులను పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం నిలిపివేయడంతో పనులు అసంపూర్తిగా నిలిచాయి. దీంతో విద్యార్థులు సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. పెద్దకంబలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రధాన రహదారి నుంచి పాఠశాలకు వెళ్లాలంటే పొలాల మధ్య దారిలో వెళ్లాల్సి ఉంది. వర్షాకాలం ఆ దారి బురదమయంగా ఉంటుండటంతో విద్యార్థులు నడిచి వెళ్లే సమయంలో జారి కింద పడ్డ సందర్భాలు అనేకం. నర్సాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద అదనపు తరగతి గదులు పూర్తి కాలేదు. ప్రహరీ పనులు ప్రారంభించి అర్త్ బీం, పిల్లర్లతో నిలిపేశారు. కిచెన్ షెడ్డు మధ్యలో నిలిపేశారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకులు ఇంటి వద్ద వంటి చేసి తీసుకొస్తున్నారు. అలాగే చిత్రేనిపల్లె పాఠశాలకు వెళ్లేందుకు దారి సమస్య ఉంది. ముకుందాపురంలో నాడు–నేడు పనులు పూర్తి కాలేదు.ఇలా అడుగడుగునా సమస్యలు వేధిస్తున్నా కూటమి ప్రభుత్వం వాటి పరిష్కారం ఊసెత్తక పోవడం దారుణం.

మోగనున్న బడి గంట

ఉయ్యాలవాడ : వేసవి సెలువుల్లో ఆటపాటలతో సరదా సరదాగా గడిపిన విద్యార్థులు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. మొదటి రోజే పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ 1 రఘురామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్ పాఠశాలల్లో చదువు విద్యార్థులకు 9,200 పాఠ్యపుస్తకాలు, 14,400 నోటు పుస్తకాలు, 1990 స్కూల్ బ్యాగులు, 1287 బెల్టులు, 1990 యూనిఫాం, 6వ తరగతికి 140 డిక్షనరీలు మంజూరయ్యాని పేర్కొన్నారు.

సకాలంలో పాఠ్య పుస్తకాలు అందేనా

గోస్పాడు: గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను నాడు– నేడు పథకం ద్వారా రెండు విడతలలో రూ. కోట్లు ఖర్చు చేసి రూపురేఖలను మార్చి విద్యార్థులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు.

స్టూడెంట్ కిట్ పూర్తి స్థాయిలో అందేనా?

ఇప్పటికే ఒక విడత తల్లికివందనం రాక పోవడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే విద్యార్థులకు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అందాల్సిన స్టూడెంట్ కిట్ పూర్తిస్థాయిలో అందుతుందో లేదో అర్థంకాని పరిస్థితి. ప్రస్తుతం పాఠ్యపుస్తకాలు 15,600, నోట్ పుస్తకాలు 20,160, బ్యాగులు 3,293, యూనిఫామ్‌లు 5,846 అందాయని, అయితే డైరీలు, బెల్ట్‌లు, బూట్లు ఇంతవరకు రాలేదని అధికారులు చెబుతున్నారు. గతంలో పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులు విద్యా కానుక కిట్లను అందించేవారు.

నాడు– నేడుతో పాఠశాలల అభివృద్ధి..

మండలంలో ఉన్న 32 ప్రభుత్వ పాఠశాలలో నాడు– నేడు కింద రూ. 10 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీర్చిదిద్దింది. మొదటి విడత కింద 14 పాఠశాలలో రూ. 4.10 కోట్లు, రెండవ విడత కింద 16 పాఠశాలలను రూ.6.83 కోట్లు ఖర్చుచేసి పేదవిద్యార్థులకు విద్యా వసతులను కల్పించింది.



నాడు- నేడు కింద అభివృద్ధి చేసిన ఎం.చింతకుంట్లలోని పాఠశాల

ఒప్పంద అధ్యాపకులకు వేతనాలు చెల్లించాలి

గోస్పాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు వేతనాలు చెల్లించాలని ఆ సంఘం జేఏసీ జాయింట్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అధ్యాపకులకు 12నెలల కాలానికి సంబంధించిన వేతనాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. 2025–26 విద్యాసంవత్సరానికి రెన్యూవల్‌ను ఒక రోజు విరామంతో సవరించి ఇవ్వాలని, ఉత్తర్వులలో పొందుపరచాలన్నారు. గత విద్యా సంవత్సరంలో రెమిడియల్ క్లాసులు, సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించడంతో పాటు పేపర్ మూల్యాంకనం, అడ్మిషన్ డ్రైవ్‌ను మే నెలలో చేపట్టామని పేర్కొన్నారు. బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

ఆలయాభివృద్ధికి కృషి

నంద్యాల(వ్యవసాయం): ప్రథమ నంది దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని న్యాయశాఖ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం ఆలయ ఆవరణలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. ముందుగా ఆలయ అధికారులు పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. వంటశాల గది నిర్మాణానికి, గదుల నిర్మాణానికి భూమి పూజ చేపట్టారు. దేవస్థానంలో ఒక ట్యాంక్, ఉత్తరం తూర్పు వైపున మాడవీధులు, దేవస్థానం స్థలాన్ని కొలత వేయించి ప్రహరీ నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. ఫిరోజ్, కౌన్సిలర్లు శ్యాం సుందర్ లాల్, శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ దాస్, శ్యాంసుందర్ గుప్తా, దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు చలం బాబు, ఈఓ రామనుజన్ పాల్గొన్నారు.

బీపీపై అవగాహన అవసరం



వైద్యవిద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

గోస్పాడు: బీపీ పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్ అన్నారు. నంద్యాల మెడికల్ కాలేజీలో బుధవారం రెండవ సంవత్సరం వైద్య విద్యార్థులకు బీపీపై అవగాహన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వరల్డ్ హైపర్ టెన్షన్ డే లో భాగంగా దీర్ఘకాలిక వ్యాధుల్లో బీపీ ఒకటని, వ్యాధితో బాధపడే వారు నిర్లక్ష్యం వహించరాదన్నారు. బీపీతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. నాలుగు రోజుల క్రితం బీపీ వ్యాధిపై విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరిచిన సాయి అచ్యుత్, యశ్వంత్ రామ్, రమేష్ లకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్స్‌పాళ్లు రాజశేఖర్, కళావతి, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ మదన్‌మోహన్‌రావు, ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ పాల్గొన్నారు.

డ్రోన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల (అర్బన్): ప్రభుత్వం యాంత్రీకరణలో భాగంగా బ్యాంక్‌ల ద్వారా 80శాతం రాయితీతో అందించే డ్రోన్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. నంద్యాల మండలం రాయమాల్పురం, చాపిరేవులు గ్రామాలకు చెందిన రైతుమిత్ర గ్రూప్ రైతులకు రాయితీ కింద మంజురైన డ్రోన్‌లను బుధవారం అందించారు. మంత్రి మాట్లాడుతూ డ్రోన్‌ల ద్వారా పైరుపై పురుగు మందు పిచికారీ సులభతరంగా ఉంటుందన్నారు.కూలీల కొరతను నివారించేందుకు ఉపయోగపడతాయన్నారు.ఏఓ ప్రసాదరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్డీ జ్యోతి పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణలకు నిధుల కేటాయింపు

జిల్లాలో వివిధ పథకాల కింద మంజూరైన రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. బుధవారం స్థానిక సంజీవ్ నగర్ నుంచి శ్రీనివాస నగర్ వరకు రూ.4.5కోట్ల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 7 రహదారుల పనులకు రూ.10.89 కోట్లు కేటాయించారని, అలాగే సంజీవ్ నగర్ నుంచి శ్రీనివాస నగర్ వరకు నిర్మించనున్న సిమెంటు రోడ్లు నిర్మాణాలు చేయడానికి గాను రూ.4.5 కోట్లు కేటాయించారని చెప్పారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖలకు చెందిన 968 పనులకు గాను రూ.102.62 కోట్లతో ప్రారంభించనున్నామని మరో రూ.206.14కోట్లతో 198పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నామని వివరించారు. ఆర్ అండ్‌బీ డీఈఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ దాసు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీ బదిలీ

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు పాణ్యం మండల కేంద్రానికి బదిలీ అయినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న రామగోపాల్‌ను ఉయ్యాలవాడకు ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ మనోహర్‌రెడ్డి నంద్యాల పంచాయతీ రాజ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. అలాగే దొర్నిపాడు నుంచి పంచాయతీ కార్యదర్శి మహేష్ బాబు మండలంలోని బోడెమ్మనూరు గ్రామ సచివాలయానికి, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ సువర్ణను ఆర్.జంబులదిన్నె గ్రామ సచివాలయానికి బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జారీ చేసిన ఉత్తర్వులు కార్యాలయానికి అందాయని ఎంపీడీఓ వెల్లడించారు.

వేలంలో పెరిగిన ఆదాయం

నంద్యాల (వ్యవసాయం): పట్టణ శివారులోని శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం భూములకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో ఆదాయం పెరిగినట్లు ఆలయ ఈఓ వేణునాథరెడ్డి తెలిపారు. దేవస్థానం చెందిన 4.04 ఎకరాలకు లీజు కాలం ముగియడంతో బుధవారం కోవెలకుంట్ల గ్రూపు దేవాలయల కార్యనిర్వహణాధికారి, బాలచెంచన్న ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల కాలానికి బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో ముగ్గురు రైతులు దక్కించుకున్నారు. ఈ ఏడాది వేలంలో రూ.1,10,000 రాగా, గతంలో రూ.37 వేలు మాత్రమే వచ్చిందని, గతంలో వచ్చిన దానికన్నా ఈసారి రూ.73వేల ఆదాయం సమకూరిందని ఈఓ వివరించారు. మున్సిపల్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసరు, మాజీ చైర్మన్ సన్నాల వెంకటరెడ్డి, ఆలయ అర్చకుడు షణ్ముఖ పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని స్పటిక లింగేశ్వరాలయంలో బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉదయం యోగానంద ఆధ్వర్యంలో శ్రీ అచల పరిపూర్ణ యోగానంద పాములేటి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. స్పటిక లింగేశ్వరుడికి ప్రత్యేక పూజల అనంతరం లోక కళ్యాణార్థం ప్రత్యేక హోమాలు చేపట్టారు. పూర్ణాహుతి తదనంతరం అన్నదానం చేశారు. తిమ్మయ్య,అనిల్,వెంకట సుబ్బయ్య, రఘునాథ రెడ్డి,వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు 14 రోజుల్లో పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామని ఏపీ మున్సిపల్ వాటర్ వర్కర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాకు వినతి పత్రం అందజేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు కెఎండీ గౌస్, భాస్కరాచారి, రంగనాథ్,రామాంజనేయులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు జీఓల ప్రకారం జీతాలు పెంచాలని,కూటమి ప్రభుత్వం రాతపూర్వక ఒప్పదంలో 2019 నుంచి అమలు చేస్తామన్న సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు పదవీ విరమణ బెనిఫిట్స్, దహన సంస్కారాలకు రూ.20 వేలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామన్నారు. ఏపీ మున్సిపల్ వాటర్ వర్క్స్ నాయకులు ప్రసాదరావు,కరిముల్లా,సుబ్రహ్మణ్యం, మురళీ,ఆదాం,రామకృష్ణ, క్రిష్ణయ్య,రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉపాధి కూలీలకు గరిష్ట వేతనం అందాలి

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో కూలీలకు ప్రతి రోజు రూ.300 గరిష్ట వేతనం పడేలా చూడాలని ఎంపీడీఓ సుగుణశ్రీ అన్నారు. కూలీలకు పనుల కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి అర్హులైన సన్నకారు రైతులకు రాయితీలపై అవగాహన కల్పించాలన్నారు. ఏపీఓ గణేష్ పాల్గొన్నారు.

కబ్జాకోరులను శిక్షించాలి

బొమ్మలసత్రం: ఆలయ భూములను కబ్జా చేసే వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మధు జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణాను కోరారు. బుధవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసిన అనంతరం మధు మాట్లాడుతూ పట్టణ శివారులోని వైఎస్సార్ నగర్‌లో కొందరు సుంకులమ్మదేవి ఆలయ భూములను కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆలయానికి చెందిన 30 సెంట్ల భూమికి సంబంధించి తప్పుడు పత్రాలు తయారు చేసి కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని వివరించారు.

తహసీల్దార్‌కు సన్మానం

శిరివెళ్ల: తహసీల్దార్ పుష్పకుమారి ఆర్‌డీఓ కార్యాలయ ఏఓగా బదిలీయయ్యారు. ఈ మేరకు బుధవారం వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఆమెకు శాలువలు కప్పి పూలమాలలతో సన్మానం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఆశోక్ కుమార్‌కు తన బాధ్యతలను అప్పజెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా చెన్నుడు

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా చెన్నుడు నియమితులయ్యారని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప బుధవారం తెలిపారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేస్తున్న మనోహర్ కోటపాడుకు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగిందన్నారు. నూతన కార్యదర్శి స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై కార్యదర్శి అయ్యారని చెప్పారు. కామినేనిపల్లె పంచాయతీ కార్యదర్శి పోస్టు త్వరలో భర్తీవుతుందని పేర్కొన్నారు.

కుర్చీల అందజేత

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునికమైన 10 కుర్చీలను రోటరీ క్లబ్ సభ్యులు బుధవారం అధికారులకు అందజేశారు. రోటరీ అధ్యక్షుడు మోహనరెడ్డి, కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ బస్టాండ్‌లోని కుర్చీలు పాడవడంతో స్టీల్ కుర్చీలను అందజేశామన్నారు. క్లబ్ సభ్యులు దాతలు వైద్యులు విజయభాస్కర్ రెడ్డి, భార్గవర్ధన్ రెడ్డి, మురళీమోహన్, రాజీవ్, మనోజ్, కేశవరెడ్డి పబ్లిక్ స్కూల్ సహకారంతో అందజేశామని చెప్పారు. డిపో మేనేజర్ ఏ గంగాధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ కిశోర్ పాల్గొన్నారు.

విజేతగా అల్లూరు వృషభాలు



మొదటిస్థానంలో నిలిచిన అల్లూరు వృషభాలు

దొర్నిపాడు:మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె మూలపెద్దమ్మ దేవర సందర్భంగా బుధవారం నిర్వహించిన న్యూ కేటగిరీ వృషభాల బండలాగుడు పోటీల్లో భాగంగా ఉయ్యాలవాడ మండలం అల్లూరి గ్రామానికి చెందిన అరికట్ల శివారెడ్డికి చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలవగా, యాగంటి నాగమద్దిలేటి జ్ఞాపకార్థం భాస్కర్ రూ.లక్ష నగదును అందజేశారు. పెద్దకొట్టాల, బాలయ్యగారిపల్లె గ్రామాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలకు రెండో బహుమతి రూ.75వేలు, ముల్లా యూసుఫ్ బాషా, శివప్రసాద్, కొస్నూరుకు చెందిన వీరబ్రహ్మనాయుడు మూడో బహుమతి రూ.50వేలు, పలుకూరి బాలచంద్రుడు, నాల్గో బహుమతి అక్కంపల్లి, యంగనపల్లె గ్రామాలకు చెందిన ఇంద్రారెడ్డి, వాసుదేవారెడ్డిలకు శిరివెళ్ల కమలాకర్ రూ.30వేలు, ఐదవ బహుమతి బోరెడ్డి కేశవ రెడ్డికి భూమా తులసీశ్వరరెడ్డి రూ.25వేలు, 6వ బహుమతి హైదరబాద్‌కు చెందిన రోహన్‌బాబుకు మద్దుబైగారి జాకీర్‌బాషా రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో వెంకటశివ, శ్రీకాంత్, విశ్వనాథ్, రాము, షబ్బీర్‌బాషా, ముక్తార్‌బాషా, మహితాబ్‌బాషా పాల్గొన్నారు.

సెంటిమెంట్ పొట్టేలు



దొర్నిపాడు: చూట్టూ జన సందోహం మధ్య డబ్ల్యూ గోవిందిన్నెలో ఎడ్ల బండలాగుడు పోటీలు జరుగుతున్నాయి. చప్పట్లు కేరింతలు మధ్య వృషభాలు బలప్రదర్శను పోటాపోటీగా ప్రదర్శిస్తున్నాయి. ఇంతలో ఓ ఎడ్ల వంతు రావడంతో చప్పట్లతో కేకలు వేస్తున్న జనం నిశబ్ధంగా మారారు. ఇంతలో అనంతపురం జిల్లా అక్కంపల్లెకు చెందిన రైతు ఇంద్రారెడ్డి ఎడ్లు బండ లాగేందుకు బరిలోకి దిగాయి. దీంతో ఆ ఎడ్ల వెంట ఓ పొట్టేలు కనిపించడంతో అందరూ దాన్నే చూస్తుండిపోయారు. మెడలో గంట, తలపై ఎర్రటి చెండు, ముఖానికి సెలిమేర కట్టడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బండలాగుడు పోటీల్లో సెంటిమెంట్‌గా పొట్టేలును వెంట తీసుకెళ్తామని నిర్వాహకులు తెలిపారు. వారి వృషభాలు పోటీలో నాల్గోస్థానంలో నిలిచి రూ.30వేలు కైవసం చేసుకున్నాయి.

రామతీర్థంలో చోరీ

- 20కిలోల వెండి అపహరణ



ఆలయ ప్రాంతంలో వివరాలు సేకరిస్తున క్లూస్ టీం

ఆళ్లగడ్డ: మండలంలోని ఆర్.క్రిష్ణాపురం శివారులో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో భారీ చోరీ జరిగింది. ఈఓ సాయి జయచంద్రారెడ్డి వివరాల మేరకు.. ఆలయంలోని వెండి తోరణాలు, పడగలు, కవచాలు వంటి 20 కిలోల వెండిని గుర్తుతెలియని దుండగులు అపహరించినట్లు చెప్పారు. రోజులాగే బుధవారం ఉదయం 5 గంటల సమయంలో అర్చకులు ఆలయం తెరిచేందుకు వచ్చి చూడగా చోరీకి గురైనట్లు గమనించి ఫోన్ చేయగా..వెంటనే క్షత్రానికి చేరుకొని పోలీసులుకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

సీసీ కెమెరాల ధ్వంసం..

దుండగులు ఆలయం తాళాలు పగలగొట్టి వెంటనే సీసీ కెమెరాలను ధ్వంసం చేయడమే కాకుండా.. ఎలాంటి ఆధారాలు దొరకకుండా హార్డ్‌డిస్క్‌ను తీసుకెళ్లారు. పరిసరాల్లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు.

గ్రంథాలయం తనిఖీ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీ పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డులు, గ్రంథాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. తదుపరి గ్రంథాలయ అభివృద్ధికి నంద్యాల పురపాలక, పంచాయతీ కార్యాలయ అధికారులను కలిసి గ్రంథాలయ సంస్థకు జమ కావలసిన సెస్సును సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చివరగా గ్రంథాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి శ్రీధర్, విశ్రాంత గ్రంథాలయాధికారి రాఘవరెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా ఉన్నట్లేనా!

- బాలకార్మికులకు ప్రత్యేక చట్టం
- పనిలో ఉంచుకుంటే యజమానులకు తప్పని అవస్థలు
- నేడు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం



బాలకార్మిక చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

గోస్పాడు: 14 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్ట విరుద్ధమైనప్పటికీ ఆర్థిక కారణాల వల్ల బాలలు పనుల్లో చేరుతున్నారు. బస్టాండ్లు, హోటల్స్, మెకానిక్ షెడ్లు, పలు అపార్ట్‌మెంట్లలో, చెత్త సేకరణ వంటి పనులలో బాలలు కనిపిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే బాలకార్మికుల సంఖ్య తగ్గినా పూర్తిగా మార్పు రావడం లేదు. బాలికలకు బాల్య వివాహాలు చేస్తుండటంతో చిన్న వయస్సులోనే బిడ్డలకు తల్లులవుతున్నారు. బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకు అంతర్జాతీయ కార్మిక సంస్థ 2002లో జూన్ 12 నుంచి ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవంగా ఏటా నిర్వహిస్తోంది.

రక్షణ చట్టాలివీ..

బాల కార్మికుల రక్షణకు అనేక చట్టాలను రూపొందించారు. బాలకార్మికుల సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కరించేందుకు అప్పట్లో ప్రత్యేకంగా గురుపాదస్వామి కమిటీని1979లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1986 బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం రూపొందించారు. 2009 విద్యా హక్కు చట్టం ద్వారా బాల బాలికలకు నిర్బంధ విద్య అందిస్తున్నారు. 2016 బాల కార్మికుల సవరణ చట్టం 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టడాన్ని నిషేధించింది. ఇలా పలు చట్టాలను ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. బాల కార్మికుల గురించి ఫిర్యాదు చేసేందుకు చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు ఫోను చేసే వెసలుబాటు ఉంది. 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు, కౌమార కార్మికుల కింద 14 సంవత్సరాలు నిండి 18 లోపు గల పిల్లలను పనుల్లో పెట్టుకుంటే యజమానికి 6 నెలలు నుంచి 24 నెలల జైలు శిక్ష లేదా రూ.20 వేలు నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధిస్తారు.

జిల్లాలో కేసుల వివరాలు..

సంవత్సరం	నమోదైన కేసులు	వారికి చెల్లించిన మొత్తం (రూ. వేలల్లో)
2022	21	33,842
2023	52	69,280
2024	13	21,350
2025	10	9,932

బాలలతో పని చేయించడం నేరం

కార్మిక చట్టం నిబంధనల ప్రకారం బాలబాలికలతో పనులు చేయించడం నేరం. ప్రతి బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో కలిసి కార్మిక శాఖ తనిఖీలు చేస్తున్నాం. బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే పట్టుబడిన యజమానులపై బాల కార్మిక చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నాం.

– బషీరున్నీసా బేగం, సహాయ కార్మిక కమిషనర్, జిల్లా ఇంచార్జ్, నంద్యాల